త్వరలో జిల్లాకు రానున్న సీఎం రేవంత్‌రెడ్డి

నిజామాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈ నెలాఖరులో సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో పర్యటించనున్నట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉండటంతో జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన పాల్గొననున్నట్లు తెలిసింది. ఈ నెల 30 లేదా 31 తేదీలలో సీఎం పర్యటన ఉండే అవకాశం ఉండడంతో జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, వర్షాభావ పరిస్థితిని బట్టి సీఎం పర్యటన ఖరారయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.



ఎడపల్లిలో ఎరువుల గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్

రైతులకు సరిపడా ఎరువులు

- కొరత ఉందన్న వదంతులు నమ్మొద్దు
- రైతులు ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపాలి
- ఆయిల్‌పామ్ సాగుకు అన్ని విధాలా ప్రభుత్వ సబ్సిడీ
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

ఎడపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్ పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఈ విషయంలో రైతులు ఆందోళనకు గురి కావద్దని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని సహకార సంఘం ఎరువుల గోదామును కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గిడ్డంగిలో ఉన్న ఎరువుల నిల్వలు రికార్డులో నమోదు చేసిన విధంగా ఉన్నాయో లేదో అని పరిశీలించారు. యూరియా కొరత ఉందన్న వదంతులను నమ్మవద్దని జిల్లాలో ఇంకా 11వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి రెండు రోజులకు ఒకసారి జిల్లాకు యూరియా సరఫరా అవుతుందన్నారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు అన్ని విధాల సబ్సిడీని ఇస్తూ ప్రోత్సాహకాన్ని అందిస్తుందని, రైతులు ఆయిల్‌పామ్ సాగుపై మొగ్గు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దత్తాత్రి, మండల వ్యవసాయ అధికారి సిద్ధి రామేశ్వర్, సహకార సంఘం అధ్యక్షుడు పోల మల్కారెడ్డి ఉన్నారు.

ప్రపంచ బాక్సింగ్ పోటీలకు నిఖత్

- భారత క్రీడాకారుల బృందానికి సారథ్యం



సుభాష్‌నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పాటైన ప్రపంచ బాక్సింగ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే మొట్టమొదటి చాంపి యన్‌షిప్‌లో పాల్గొన్న భారత బాక్సర్ల బృందానికి ప్రపంచ మాజీ చాంపియన్ నిఖత్ జరీన్ సారథ్యం వహించనుంది. సెప్టెంబరు 4నుంచి 14వ తేదీ వరకు ఇంగ్లండ్ దేశంలోని లివర్‌పూ ల్‌లో జరగనున్న పోటీల్లో ఆమె పాల్గొననుంది. 51కిలోల విభాగంలో నిఖత్ జరీన్ పోటీ పడనుంది.

ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వోగా స్వప్న



సుభాష్‌నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వోగా అదనపు బాధ్యతలను స్వప్న స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని నూతన ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పచెప్పిన ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. నిజామాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కల్తీకల్లు, క్రైమ్‌ను కంట్రోల్ చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఎస్‌హెచ్‌వోకు ఎస్సైలు మల్లేష్, సుస్మిత, సింధు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పెద్దాసుపత్రికి సుస్తీ!



- సమస్యల వలయంలో జిల్లా కేంద్ర ఆసుపత్రి
- పెచ్చులూడుతున్న భవన పైకప్పు
- అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ
- తరచూ మొరాయిస్తున్న లిఫ్టులు
- ప్రతిపాదనల దశలోనే మరమ్మతులు
- ఆసుపత్రి సిబ్బంది, ఉద్యోగుల మధ్య కొరవడుతున్న సఖ్యత
- సూపరింటెండెంట్లుగా వచ్చేందుకు జంకుతున్న అధికారులు

దవాఖాన ఎదుట నిలిచిన వర్షపు నీరు



చెత్తాచెదారంతో పేరుకుపోయిన ఆసుపత్రిలోని డ్రైనేజీ

నిజామాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేందుకు ప్రభుత్వం 2012లో నిర్మించిన జిల్లా కేంద్ర ఆసుపత్రి ప్రస్తుతం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ఆసుపత్రిని నిర్మించి 13 ఏళ్లే అయినా అప్పుడే శిథిలావస్థకు చేరుకుంది. ఆసుపత్రిలోని వార్డుల్లో పెచ్చులూడి రోగులు భయం భయంగా గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఇటీవల రెగ్యులర్ సూపరింటెండెంట్‌ను నియమించినా ఆయన విధుల్లో చేరలేదు. ప్రస్తుతం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ పర్యవేక్షణలోనే ఆసుపత్రి నిర్వహణ కొనసాగుతోంది. గతంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆసుపత్రిని పరిశీలించి అప్పటి సూపరింటెండెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ ఇప్పటికీ మరమ్మతులకు సంబంధించి నిధులు విడుదల కాకపోవడంతో ఆసుపత్రిలో పరిస్థితి అధ్వానంగా ఉంది. మేలో ఆసుపత్రిలోని చిల్డ్రన్స్ వార్డులో పైకప్పు పెచ్చులు ఊడి చిన్నారి గాయపడిన ఘటన జరిగింది. ఆసుపత్రిలో లీకేజీలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో లీకేజీలతో వార్డులన్నీ వర్షం నీటితో గోడలు చెమ్మ వచ్చి ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. నిత్యం 2వేల మందికి పైగా ఓపీ ఉండే జీజీహెచ్‌లో సరైన పర్యవేక్షణ లేక పరిపాలన అస్తవ్యస్తంగా మారుతోంది. రెండు రోజుల క్రితం ఆసుపత్రిలో లిఫ్టులు పనిచేయక మధ్యలోనే ఆగిపోయి రోగులు, బంధువులు ఇబ్బంది పడ్డారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

జీజీహెచ్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంటుంది. వ్యర్థాలు, ఇతరత్ర పదార్థాలతో ఆ ప్రాంతమంతా దుర్గంధంతో ఉంటుంది. డ్రైనేజీ పైప్‌లైన్ పగిలిపోయి మురికి నీరంతా రోడ్డుపై ప్రవహిస్తోంది. ఆసుపత్రిలో పలు అంతస్తుల్లో తాగునీటి కులాయిల వద్ద లీకేజీల పర్వం కొనసాగుతోంది. జీజీహెచ్ మరమ్మతులకు సంబంధించి ఇటీవల హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ప్రభుత్వ సలహాదారు ఆసుపత్రి సూపరింటెండెంట్, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి మరమ్మతులకు 2కోట్ల 66లక్షలు ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేసినా బడ్జెట్ విడుదల కాలేదు.

పర్యవేక్షణ లేక ఇబ్బందులు

750 పడకలతో నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు అందుబాటులో ఉన్న జీజీహెచ్ ఆసుపత్రి సరైన పర్యవేక్షణ లేక గాడి తప్పుతోంది. పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌గా

మిగతా 8వ పేజీలో...



ఎస్సారెస్పీకి పెరుగుతున్న ఇన్‌ఫ్లో

- ప్రాజెక్టులోకి 5,208 క్యూసెక్కుల వరద

మెండోర, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి 5,208 క్యూసెక్కుల వరద వచ్చి చేరిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091. 00 అడుగులు, 80.5 టీఎంసీలు కాగా శుక్రవారం సాయంత్రానికి 1068.90 అడుగులు, 21.541 టీఎంసీల నీటి నిల్వఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులోకి జూన్ 1వ తేదీ నుంచి ఎగు వ ప్రాంతాల నుంచి 11 టీఎంసీల వరద వచ్చిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

ఉమ్మడి జిల్లా స్పెషల్ అధికారిగా
రాజీవ్‌గాంధీ హన్మంతు

- పథకాలు, అభివృద్ధి పనుల పర్యవేక్షణకు నియామకం



నిజామాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలకు సీనియర్ ఐఏఎస్‌లను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించింది. ప్రభుత్వ పథకాలపై పర్యవేక్షణతో పాటు భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలకు స్పెషల్ అధికారులుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాలకు స్పెషల్ అధికారిగా రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి రాజీవ్‌గాంధీ హన్మంతును నియమించారు. రాజీవ్‌గాంధీ హన్మంతు నిజామాబాద్ కలెక్టర్‌గా పనిచేశారు.

అర్హులైన ప్రతీ కుటుంబానికి రేషన్ కార్డు



సాలూరలో రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

- అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- మండలాల వారీగా రేషన్ కార్డుల పంపిణీ : కలెక్టర్
- సాలూర, బోధన్‌లో రేషన్ కార్డుల పంపిణీ షురూ

బోధన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి కుటుంబానికీ రేషన్ కార్డులు అందజేస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ నియోజకవర్గంలోని సాలూర మండల కేంద్రంతో పాటు బోధన్, మండల కేంద్రాలకు సంబంధించిన లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. సాలూర మండల కేంద్రంలో టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలానికి చెందిన 108 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులను అందజేశారు. బోధన్‌లోని లయన్స్ ఆసుపత్రి సమావేశపు మందిరంలో బోధన్ మండలానికి చెందిన 665 కుటుంబాలకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 2.50లక్షల రేషన్ కార్డులు మాత్రమే అందించిందని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం యేడాదిన్నర వ్యవధిలోనే 6లక్షల పైచిలుకు కార్డులను పంపిణీ చేస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం తోడ్పటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మండలాల వారీగా రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 11,852 కొత్త రేషన్ కార్డులతో పాటు 84,232మంది కొత్త సభ్యుల పేర్లను రేషన్ కార్డులో చేర్చడం జరిగిందన్నారు. రేషన్ కార్డులు కలిగి

మిగతా 8వ పేజీలో...



- నగరంలో గుంతలమయంగా రహదారులు
- వర్షపు నీరు నిలిచి కనపడని గుంతలు
- ప్రమాదాల బారిన వాహనదారులు
- గతుకుల రోడ్లతో రాకపోకలకు తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



నగరంలోని లలితామహల్ థియేటర్ రోడ్డు దుస్థితి ఇలా..

ఆర్‌అండ్‌బీ రోడ్లు ఆగమాగం

నిజామాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని ప్రధాన రహదారులన్నీ గుంతలమయంగా మారాయి. వర్షాకాలంలో ప్రజలు రోడ్లపై వెళ్తూ గుంతలవల్ల ప్రమాదాలబారిన పడుతున్నా రోడ్లు, భవనాల శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రధాన రోడ్లకు ఐదు సంవత్సరాలకు ఒకసారి అవసరమైతే రెండేళ్లకొకసారి మరమ్మతులు చేయాల్సి ఉండగా నిధులు లేక పనులు చేపట్టక పోవడంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారుతున్నాయి. ప్రధాన రోడ్ల పరిస్థితి కొంచెం మెరుగ్గా ఉన్నా గ్రామాలకు వెళ్లే రహదారులు మాత్రం గుంతలమయంగా మారాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లు, భవనాల శాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. శాఖలోని కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉండటంతో పర్యవేక్షణ లేక ఆర్‌అండ్‌బీ శాఖ ఆగమాగం అవుతుంది. నిజామాబాద్ నగరం నుంచి వర్నికి వెళ్లే రహదారి పూర్తిగా గుంతలమయంగా ఉంది. మల్లారం వరకు రోడ్డు బాగానే ఉన్నా నిజామాబాద్ వైపు మాత్రం ఇంకా రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. దీంతో గుంతలమయంగా ఉన్న రోడ్డుపై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద పెద్ద గుంతలు ఉండటంతో వర్షాకాలంలో అవి వర్షం నీటితో నిండి ఉండి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే ఆర్మూర్ వైపు వెళ్లే రహదారి పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కొన్నిచోట్ల పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

కీలక పోస్టులన్నీ ఖాళీ...

రోడ్లు, భవనాల శాఖలో కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉండటంతో ఆ శాఖపై పర్యవేక్షణ లేకపోవడంతో పూర్తిగా గాడి తప్పుతోంది. ప్రస్తుతం సూపరింటెండింగ్ ఆఫ్ ఇంజనీర్‌గా ఉన్న సత్యనారాయణరెడ్డి ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ప్రస్తుతం ఆయన ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ బాధ్యతలు సైతం నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ సైతం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అక్కడ ఇక్కడ విధులు నిర్వహించడం కష్టంగా ఉంటుంది. దీంతో ఇక్కడ పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. జిల్లాలో మొత్తం 18 అసిస్టెంట్ ఇంజనీరింగ్ పోస్టులు ఉండగా ప్రస్తుతం 9 మంది పనిచేస్తుండగా 9 ఖాళీలు ఉన్నాయి. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ పోస్టులు 3 ఉండగా ఇద్దరు పనిచేస్తుండగా ఒక పోస్టు ఖాళీగా ఉంది. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ పోస్టులు 6 ఉండగా, ఐదుగురు పనిచేస్తుండగా ఒక పోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుతం జిల్లాలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ పోస్టు ఖాళీగా ఉంది. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతోపాటు సరిపడా సిబ్బంది లేక ఇతర పనిభారాల వల్ల పనులు సక్రమంగా సాగడం లేదు.



శాకంబరి అలంకరణలో అమ్మవారు

ఆలయాల్లో శ్రావణ సందడి

- తొలి శుక్రవారం పూజల్లో భక్తులు

నిజామాబాద్ కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించగా విష్ణు ఆలయాల్లో అష్టోత్తరశత తులసిఅర్చనలు అమ్మవారి దేవాలయాల్లో కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాల్లో సాయంత్రం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. పలు ఆలయాల్లో అన్నప్రసాదాన్ని భక్తులకు అందజేశారు.

వారాహి అమ్మవారికి పూజలు

నగరంలోని అమ్మ వెంచర్‌లోగల వారాహి మాత సన్నిధానంలో శుక్రవారం శ్రావణమాస పూజలు నిర్వహించారు. అభిషేకం, మహిళల సామూహిక కుంకుమార్చనలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాంచాల జ్ఞానేందర్ మాట్లాడుతూ శ్రావణంలో ప్రతీరోజు ఆలయ సన్నిధానంలో పూజలు జరుగుతాయని ఆయన తెలిపారు.



కాంగ్రెస్ మేనిఫెస్టో ఈ శతాబ్దపు మోసం

- రేవంత్ ప్రభుత్వంలో అన్ని వర్గాలు మోసపోయాయి
- ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలుచేయకుండా దగా చేశారు
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గట్టి బుద్ధిచెప్పాలి
- దళిత ఆత్మగౌరవ గర్జనలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కామారెడ్డి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం కాంగ్రెస్ ప్రభుత్వ మేనిఫెస్టో అని, ఆ ప్రభుత్వం చేతిలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు దారుణంగా మోసపోయారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ మండిపడ్డారు. గత ఎన్నికల సమయంలో చేవెళ్లలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే సమక్షంలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను అమలుచేస్తామని ప్రకటించి తీరా ప్రభుత్వం వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదని ఆరోపించారు. కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేట మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో దళిత ఆత్మగౌరవ గర్జన బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. గత అంబేద్కర్

మిగతా 8వ పేజీలో...

ఆరేళ్ల పాపపై పెంపుడు తండ్రి దాష్టీకం

- చిన్నారిని చితకబాదిన వైనం
- గాయాలను చూసి హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇచ్చిన స్థానికులు

ఆర్మూర్ టౌన్ , జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆర్మూరు మునిసిపల్ పరిధిలోని మామిడిపల్లికి చెందిన ఆరు సంవత్సరాల చిన్నారిని చితక బాదిన సంఘటన ఆల స్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. కూలీ పనుల కోసం ఆంధ్ర ప్రాంతం నుంచి మామిడిపల్లిలో కొద్ది రోజుల క్రితం తల్లి మమత, పెంపుడు తండ్రి విజయ్ పాపతో కలిసి

మిగతా 8వ పేజీలో...

పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అడుగులు

- రేంజల్ శివారులో స్థలాన్ని పరిశీలించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

8

అవసరం మేరకే యూరియా కొనాలి

● వేల్పూర్ మండల వ్యవసాయాధికారి శృతి


స్టాక్‌రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏవో శృతి

వేల్పూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రైతులు అవసరానికి మించి యూరియాను కొనుగోలు చేయవద్దని, అలా కొనుగోలు చేయడం వల్లనే యూరియా సమస్య తలెత్తుతుందని మండల వ్యవసాయాధికారిణి శృతి అన్నారు. మండలంలోని పచ్చలనడ్కుడ సొసైటీలో యూరియా కోసం రైతులు బారులు తీరిన విషయమై ఆమె శుక్రవారం సొసైటీని సందర్శించారు. ఎరువుల స్టాక్ ను రిజిష్టర్‌ను పరిశీలించి రైతులతో మాట్లాడారు. సొసైటీ పరిధిలోని ఐదు గ్రామాలు కలిపి ఈ సీజన్‌లో సాగువిస్తీర్ణం 5905 ఎకరాలు కాగా అందుకు 650 మెట్రిక్‌టన్నుల యూరియా సీజన్ మొత్తానికి సరిపోతుందన్నారు. కాగా ఈ రోజు వరకు సొసైటీ ద్వారా 607 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగినప్పటికీ ఇంకా యూరియా కోసం బారులు తీర డం సరైంది కాదన్నారు. ఈ విషయాన్ని రైతుల అర్థం చేసుకొని సహకరించాలని కోరారు. శనివారం 400 బస్తాల యూరియా సొసైటీ గోదాంలకు వచ్చాయని అవసరం ఉన్న రైతులు మాత్రమే వచ్చి కొనుగోలు చేయాలని అందుకు రైతులందరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట సొసైటీ కార్యదర్శి స్వామి, సిబ్బంది, తదితరులున్నారు.

యూరియా అందుబాటులో ఉంది..

ముప్కాల్ : మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సంఘాలైన రెంజర్ల, వేంపల్లిలో సరిపడా యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి సాయికృష్ణ తెలిపారు. శుక్రవారం మండలంలోని రెంజర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార గోదాంను ఆయన పరిశీలించారు. రెంజర్ల సొసైటీ పరిధిలో ఇప్పటివరకు నాలుగువందల నలభై మెట్రిక్ టన్నుల యూరియా, వేంపల్లి పరిధిలో 200 మెట్రిక్ టన్నుల యూరియా ఇప్పటి వరకూ సరఫరా చేశామని సూచించారు. ప్రస్తుతం రెంజర్ల సొసైటీ పరిధిలో 400 మెట్రిక్ టన్నులు ఉందని, రైతులు తమ అవసరం మేరకే యూరియాను కొనుగోలు చేయాలని సూచించారు.

క్రైం సమాచారం

నందిగామ శివారులో చిరుత సంచారం


నందిగామ శివారులో పరిశీలిస్తున్న అటవీశాఖ బీట్ ఆఫీసర్ సుధీర్

నవీపేట,జూలై25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిగామ శివారులో చిరుతపులి సంచరిస్తుందని స్థానికులు తెలిపారు. గురువారం రాత్రి పొలానికి కాపలాగా వెళ్లిన పలువురు రైతులకు చిరుతపులి కనిపించడంతో వెంటనే ఈ విషయాన్ని గ్రామస్థులకు వివరించారు. శుక్రవారం ఉదయం చిరుత పులిపాదముద్రలు కనిపించగా అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ బీట్‌ఆఫీసర్ సుధీర్ చిరుతపులి సంచరించిన ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు. చిరుతపులి సంచరించే ప్రాంతానికి ఎవరూ ఒంటరిగా వెళ్లవద్దని గ్రామస్థులకు సూచించారు.

● **సిరన్‌పల్లి శివారులో చిరుత ...**

మండలంలోని సిరన్‌పల్లి శివారులో గురువారం సాయంత్రం చిరుత పులి సంచరించిందని స్థానికులు తెలిపారు. మండలంలోని లింగాపూర్‌కు చెందిన గొర్రెలకాపరికి చెందిన గొర్రెపై చిరుతపులి దాడికి యత్నించిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయంపై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా బీట్‌ఆఫీసర్ సుధీర్ సిరన్‌పల్లి గ్రామ శివారులో చిరుత పులి సంచరించిన ప్రాంతాన్ని పరిశీలించారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


విద్యుత్ షాక్‌తో మృతిచెందిన రాంసింగ్

భీమ్‌గల్ రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాహత్‌నగర్‌లో శుక్రవారం ధారావత్ రాంసింగ్(50) అనే రైతు విద్యుత్ షాక్‌తో మృతిచెందారు. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు రాంసింగ్ తన పొలంలో గట్లపై గడ్డికోసే యంత్రంతో గడ్డి కోస్తుండగా విద్యుత్ పోల్ నుంచి బోరు మోటార్‌కు కరెంట్ సరఫరా అయ్యే వైర్లు కట్ కావడంతో ఆ యంత్రానికి విద్యుత్ సరఫరా అయి షాక్ తగిలి అక్కడిక్కడే మృతిచెందాడన్నారు. మృతుని భార్య ధారావత్ లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంక్‌అండ్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

రెంజల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులకు నాలుగురోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. గురువారం బోర్గాం గ్రామశివారులో వాహనాల తనిఖీ నిర్వహించగా ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించి వాహనం నడపడంతో వారిపై కేసునమోదు చేసి కోర్టుకు హాజరుపర్చగా శుక్రవారం రెండోస్థాయి మేజిస్ట్రేట్ శేషతల్ప సాయి ఇద్దరు వ్యక్తులకు నాలుగు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధించిన వారిపై కేసు

కోటగిరి, జూలై25 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధించిన ఇద్దరిపై కేసునమోదు చేసినట్లు కోటగిరి ఎస్‌ఐ సునీల్ తెలిపారు. కోటగిరి గ్రామానికి చెందిన రజితను 19 ఏళ్ల క్రితం బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామానికి చెందిన రాజేష్‌తో వివాహం జరిగింది. వీరికి కూతురు, కొడుకు సంతానం ఉన్నారు. కొంతకాలంగా రజితను భర్త రాజేష్, అత్త గంగామణి రెండు లక్షల రూపాయల అదనపు కట్నం కోసం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేదించి ఇంట్లో నుంచి పంపించారు. బాధితురాలు రజిత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థుల వ్యాన్‌బోల్తా


సిరిసిల్లరోడ్డు సమీపంలో బోల్తాపడిన వ్యాన్

కామారెడ్డిటౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిరిసిల్లరోడ్డు-దత్తాత్రేయ ఆశ్రమం రోడ్డు మధ్యలో విద్యార్థులను తరలిస్తున్న ప్రైవేట్ వ్యాన్ బోల్తాపడింది. ఇందులో శ్రీచైతన్య పాఠశాలలో చదివే పలువురు చిన్నారులు ప్రయాణిస్తున్నారు. వాహనం రోడ్డు కిందకు దిగి ఒకవైపు పడిపోవడంతో అందులోని దాదాపు 6 నుంచి 8 మంది వరకు పిల్లలకు స్వల్పగాయాలయ్యాయి. దీంతో సిరిసిల్లరోడ్డులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి, చికిత్స అనంతరం తల్లిదండ్రులు వారి పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు.

కురిసింది వాన...

● బోధన్‌లో లోతట్టు ప్రాంతాలు జలమయం ● శర్బత్ కెనాల్‌లో నిలిచిన నీరు ● ఆర్మూర్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు


శర్బత్ కెనాల్‌లో జలమయమైన రోడ్లు


ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్

బోధన్,జూలై25(ఆంధ్రజ్యోతి): బోధన్‌లో శుక్రవారం తెల్లవారుజాము నుంచే భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంతో పాటు మండలంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలను శుక్రవారం బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ పరిశీలించారు. భారీ వర్షానికి శర్బత్ కెనా ల్ వద్ద వర్షపు నీరు నిల్వడంతో ఆ ప్రాంతం వద్ద జలమయంగా మారింది. దీంతో మున్సిపల్ సిబ్బంది పోలీసుల సహకారంతో ట్రాఫిక్‌ను మళ్లి జేసీబీ సహాయంతో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు.

కోటగిరి : కోటగిరి, పోతంగల్ మండలాల్లో శుక్రవారం ఎడతెరిపి లేని భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచే భారీవర్షం కురియడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి గ్రామాల్లోని రహదారులు తడిగా మారాయి. చెరువు లు, నీటి కుంటలు జలకళను సంతరించుకున్నాయి.

మునిసిపల్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

ఆర్మూర్ టౌన్ : పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో ప్రజలకు అత్యవసర సేవలు, సహాయక సేవల కోసం కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మునిసిపల్ పరిధిలోని ప్రజలు అత్యవసర సేవల కోసం మున్సిపల్ కార్యాలయంలో 9948027506, 9963175237, 939628 2202 లకు సమాచారం అందించాలని తెలిపారు.

నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు

● బోధన్ మునిసిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ


బోధన్‌లో హోటళ్లను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

బోధన్,జూలై25(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో తినే వస్తువుల్లో నాణ్యతలోపిస్తే వ్యాపారస్తులపై చర్యలు తప్పవని బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని హోటళ్లను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తినే వస్తువులను నాణ్యత లోపిస్తే వ్యాపారస్తులపై కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ ఇన్స్‌స్పెక్టర్ గణేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వారాంతపు సంతలో మురికి కాలువలు నిర్మించాలి

నవీపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం జరిగే వారాంతపు సంత, శనివారం జరిగే మేకల సంత స్థలంలో మురికి కాలువల నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరారు. మార్కెట్ స్థలంలో ఇటీవల మొరంతో చదును చేయగా మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు సంత స్థలం పూర్తిగా చిత్తడిగా మారింది. దీంతో సంతకు వచ్చిన అమ్మకందారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

భిక్కనూరులో చోరీ

● ఇద్దరు వాచ్‌మన్‌లను చితకబాదిన దొంగలు
● రూ.లక్షల విలువ కలిగిన సెంట్రింగ్ పైపుల చోరీ


జేసీబీ అద్దాలను ధ్వంసం చేసిన దృశ్యం


భిక్కనూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఇద్దరు వాచ్‌మెన్‌లపై దాడిచేసి సెంట్రింగ్‌కు సంబంధించిన హైడ్రాలిక్ పైప్‌లను దుండగులు ఎత్తికెళ్లారు. ఈ ఘటన భిక్కనూరు మండలంలోని అంతంపల్లి శివారులో మాసుపల్లి పోచమ్మ ఆలయానికి వెళ్లే దారిలో ఉన్న రెడిమిక్స్ ప్లాంట్‌లో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం భిక్కనూరు టోల్‌ప్లాజా నిర్మాణం కోసం అంతంపల్లి శివారులో ఏర్పాటు చేసిన రెడిమిక్స్ ప్లాంట్ కొన్ని కారణాలతో ప్రస్తుతం మూసిఉండగా దాంట్లో భిక్కనూరుకు చెందిన బండినవీన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన చందమాల చిన్న నైట్‌వాచ్‌మెన్‌లుగా గత కొంతకాలంగా పనిచేస్తున్నారు. విధుల్లో భాగంగా గురువారం రాత్రిప్లాంట్ వద్ద నిద్రిస్తుండగా తెల్లవారుజామున పెద్దఎత్తున శబ్దం వచ్చింది. దీంతో లేచి ఫోన్‌బ్యాటరీ పెట్టుకుని చూడగా గుర్తుతెలియని దుండగులు వారిపై ఒక్కసారి గా దాడిచేసి అక్కడే ఉన్న ప్లాంట్‌లోని జేసీబీని ధ్వంసం చేశా రు. అనంతరం ప్లాంట్‌లోని సుమారు రూ.లక్ష విలువ చేసే సెంట్రింగ్‌కు సంబంధించి హైడ్రాలిక్ పైపులను ఆటోలో ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ మేరకు దుండగుల చేతిలో గాయపడిన వారు ప్లాంట్ యాజమాన్యానికి, పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సంఘటన స్థలాన్ని ఎస్సై ఆంజనేయులు సందర్శించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తు న్నామని, త్వరలోనే దుండగులను పట్టుకుంటామని తెలిపారు.

టిప్పర్ పట్టివేత

కోటగిరి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని కొత్తపల్లి గ్రామశివారులో టిప్పర్‌ను పట్టుకున్నట్లు కోటగిరి ఎస్‌ఐ సునీల్ తెలిపారు. కొత్తపల్లి శివారులో టిప్పర్ నిలిపిఉంచగా వాహనానికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మైలారం శివారులో గుర్తుతెలియని శవం లభ్యం

● మృతదేహాన్ని బైక్‌పై తీసుకొచ్చినట్లు సీసీ పుటేజీల్లో రికార్డు
● ఎక్కడో చంపి గ్రామంలో పడేసినట్లు అనుమానాలు


సీసీ టీవీ పుటేజ్‌లో కనిపించిన దృశ్యం

సిరికొండ జులై 25 (ఆంధ్రజ్యోతి): సిరికొండ మండలం మైలారం శివారులోని ఆయల్‌కుంట ఒడ్డు పక్కన చెట్ల పొదల్లో గుర్తు తెలియని యువకుడి శ వం లభించింది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. సిరికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని మైలారం గ్రామానికి చెందిన ఒక యువకుడు శుక్రవారం పశువులను కట్టివేయడానికి వెళ్ల గా కట్ట కింద మృతదేహం కనిపించడంతో భయంతో ఆ వ్యక్తి గ్రామస్థులతో చెప్పాడు. ఈ విషయాన్ని పోలీసులకు చేరవేయడంతో ధర్పల్లి సీఐ బిక్షపతి, సిరికొండ ఎస్సై జాడి రామకృష్ణ మృతదేహన్ని పరిశీలించారు. కాగా గ్రామస్థులు.. ఆ మృతదేహం తమ గ్రామానికి చెందిన వారిది కాదని తెలిపారు. మృతుడి వయస్సు 35-40 ఏళ్లు ఉండవచ్చని, ఎత్తు సుమారు 5.5 అడుగులు,ఒంటిపై బూడిద రంగు జీన్స్ ప్యాంటు, కాఫీ పొడి రంగులో డబ్బాలు గల గీతల చొక్కా ఉందని పోలీసులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈనెల 23నే పడేసి పోయారా?

మైలారం గ్రామంలో గల సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలించగా ఈ నెల 23న మోటర్ బైక్‌పై మృతదేహాన్ని కూర్చోపెట్టుకుని తీసుకెళ్లినట్లు కనిపించింది. ఎక్కడో చంపి ఇక్కడికి తీసుకొచ్చి పడేసి పోయారా? లేక ఇక్కడే చంపేసినారా అనేది తెలియడం లేదు. 23వ తేదీ మధ్యాహ్నం ఇద్దరు యువకులు మోటర్ బైక్‌పై మధ్యలో మరో వ్యక్తిని కూర్చోబెట్టుకుని తీసికెళ్లినట్లు ఫుటేజ్‌లో రికార్డు అయ్యింది. కుర్దుల్‌పేట్ గ్రామం వైపు నుంచి గ్రామ పంచాయతీ ముందు నుంచి ఆయిల్‌కుంట పైకి తీసుకెళ్లి చెట్ల పొదల్లో పడేసిపోయినట్లు గ్రామంలో చర్చించుకుంటున్నారు.

పెండింగ్ చలాన్లపై స్పెషల్ డ్రైవ్

పెద్ద కొడప్‌గల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ పోలీసులు మండల పరిధిలోని అంజనీ గేట్ వద్ద 161వ జాతీయ రహదారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్‌ఐ అరుణ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహించారు. ఎస్‌ఐ అరుణ్ మాట్లాడుతూ రహదారి నియమాలు పాటించి ప్రయాణం సాగించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రవి, శ్రీనివాస్, లాల్‌సింగ్ పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సహాయం


విద్యార్థిని సన్మానిస్తున్న గ్రూప్ సభ్యులు

వేల్పూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్‌కు చెందిన టికాయి బాలేష్ కూతురు అద్వికకిడ్నీ సమస్యతో హైదరాబా ద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఖర్చుల కోసం వేల్పూర్‌కు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ తరఫున రూ. 10వేల ఆర్థిక సహాయం అందించింది. బాసరలోని ట్రిపు ల్‌ఐటీకి వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామానికి చెందిన జుమ్మరాతి విష్ణువర్ధన్‌కు ఖర్చుల కోసం హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ఐదువేల ఆర్థిక సహాయం శుక్రవారం అం దజేశారు. అనంతరం విష్ణువర్ధన్‌ను శాలువాతో సన్మానించారు.

కారేగాంలో ఉచిత వైద్య శిబిరం


కారేగాంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కోటగిరి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారేగాం గ్రామంలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన జీసెస్ లవ్స్ యు సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 150 మందికి పైగా వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అనంతయ్య, నాయకులు ఈర్వంత్ రావు పటేల్, గజ్జు పటేల్, రవి పటేల్, నాగనాథ్ పటేల్, పంచాయతీ కార్యదర్శి క్యాకప్ప తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి


మసీదు వద్ద అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ చంద్రమోహన్

రెంజల్,జూలై25(ఆంధ్రజ్యోతి): ప్రార్థన మందిరాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ చంద్రమోహన్ అన్నారు. గురువారం మండలంలోని నీలా గ్రామంలో మసీదు వద్ద మసీదు కమిటీ పెద్దలతో ఆయన మాట్లాడారు. మసీదు ముందు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మసీదు చుట్టు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నట్లయితే నిఘా వ్యవస్థ పటిష్ఠంగా ఉంటుందని అన్నారు. మసీదు పెద్దలు సానుకూలంగా స్పందించారని త్వరలోనే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటామని మసీదు పెద్దలు వివరించారు. పండుగ సందర్భాల్లో ఎటువంటి సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని ఎస్‌ఐ అన్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ పెద్దలు తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలి


సాయిలుకు వినతి పత్రం అందజేస్తున్న ఆపరేటర్లు

వేల్పూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చూడాలని శుక్రవారం వేల్పూర్ ఎంపీవో సాయిలుకు ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు వినతి పత్రం అందజేశారు. ఇప్పటికైనా తమ చిరు ఉద్యోగుల ఆర్థిక పరిస్థితిని పరిగణలోకి తీసుకొని పది సంవత్సరాల నుంచి తాము ఎదురుచూసే హెచ్‌ఆర్ పాలసీని వెంటనే అమలయ్యే విధంగా తమ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వేల్పూర్ మండల ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు నర్సయ్య, పి.గంగకిషోర్, విద్యాసాగర్ న్నారు.

'రాష్ట్ర వ్యాప్త ఆందోళనను విజయవంతం చేయాలి'

ఆర్మూర్ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలపై జూలై 31న చేపట్టిన రాష్ట్రవ్యాప్త ఆందోళనను విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడ కార్యదర్శి ఎం.ముత్తెన్న, ఆర్ రమేష్‌లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కుమార్ నారాయణ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పెద్ద ఎత్తున్న ఆందోళన కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు కే.రాజేశ్వర్, ఏ.ప్రకాష్, నాయకులు సత్తెమ్మ పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


మంథనిలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్య త తీసుకోవాలని ఆర్మూ ర్ ఎమ్మెల్యే పైడిరాకేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మం థని గ్రామంలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరు తమ కుటుంబసభ్యుల పేరుమీదుగా వారికి అంకితం చేయాలని అన్నారు. ప్రభుత్వం భవిష్యత్‌తరాలకు మంచి వాతావరణం అందించాలనే లక్ష్యం తో వనమహోత్సవ కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రాజగంగారాం, గోవింద్‌పేట్ మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్, మంథని బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్ : మున్సిపల్ పరిధిలోని 3, 4వ వార్డులలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి మునిసిపల్ కమిషనర్ రాజు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 12, 29 వార్డులలో పారిశుధ్య పనులను పరిశీలించారు. పెర్కిట్‌లోని బస్తీ ఆస్పత్రిని సందర్శించి రోగుల వివరాలను మెడికల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు సేవ చేయడం అభినందనీయం

● ఆర్మూర్ సీఐ సత్యనారాయణ


విద్యార్థులకు టీషర్టులు అందజేస్తున్న సీఐ

ఆర్మూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కన్నవారిని మర్చిపోకుండా తండ్రి పేరిట విద్యార్థులకు సేవలందించడం అభినందనీయమని ఆర్మూర్ సీఐ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం చేపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మీనుగు లక్ష్మన్న వర్ధంతిని పరస్కరించుకుని ఆయన కుమారులు డీఎస్పీ రాజగంగారాం, హెడ్‌కానిస్టేబుల్ మీనుగు రాజేశ్వర్లు టీషర్టులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ వివిధ హోదాలో ఉద్యోగా లు చేస్తున్న సొంత ఊరిలో విద్యార్థులకు తండ్రి పేరిట సేవాకార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చేతన కుమారి, మాజీ సర్పంచ్ సాయన్న, మాజీ ఎంపీటీసీ జన్నపల్లి గంగాధర్, లింగం గౌడ్, కుస్తపురం గంగారెడ్డి, విడిసి అధ్యక్షుడు సారంగి శ్రీకాంత్, డిష్ రాజు, సతీష్, డాక్టర్ శంకర్‌దాస్, పోశెట్టి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మోర్తాడ్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని నలుగురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంజూరైన వాటిని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గిర్మాజీ గోపి, పట్టణ అధ్యక్షుడు పుప్పాల అశోక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు చెక్కులు మంజూరు చేయించిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహిపాల్, గిర్మాజీ గంగాధర్, విక్రంగౌడ్, అమ్జాద్, నసీర్, జక్కం అశోక్, వినోద్, మామిడి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్, నరేష్, భూపతిలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటికి మొదటివిడత మంజూరు


చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముప్కాల్ , జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిసాన్‌నగర్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇం టికి మొదటి విడత లక్ష రూపాయలు భూస లక్ష్మీ నరేందర్‌కు మంజూరైనట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గంగాధర్, కపిల్, రాజలింగం, చాట్ల నరేష్, నాగేష్, హన్మంత్, పురుషోత్తం తదితరు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌కు భూమిపూజ

ముప్కాల్ , జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జేపీ కాలనీలో దుర్గామాత కమిటీ ఆధ్వర్యంలో నిర్మించనున్న దుర్గామాత షెడ్డు నిర్మాణానికి శుక్రవారం దుర్గమాత కమిటీ సభ్యులు భూమిపూజ చేశారు. ఈ కమిటీ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి పది లక్షలు మంజూరైనట్లు వారు తెలిపారు. పదిలక్షలు మంజూరు చేయించిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ రెడ్డికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, ముస్కు ముత్తెన్న, రవి, అబ్రార్, ప్రశాంత్, లింగన్న, రాంరాజు, ఉమేష్, గోదావరి, ప్రమీలా, వీణ తదితరులు పాల్గొన్నారు.

రైతుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలి

● రాజు, మండల వ్యవసాయ అధికారి, మద్నూర్



ముఖాముఖి

ప్రశ్న: వానాకాలంలో రైతులు ఎన్ని ఎకరాలలో పంటల సాగు చేశారు?

జవాబు: ఉమ్మడి మద్నూర్ మండలంలో రైతులు 53350 ఎకరాలలో పంటలను సాగు చేశారు. అత్యధికంగా 35 వేల ఎకరాలలో సోయా పంట వేశారు.

ప్రశ్న: ఇప్పటి వరకు ఎంత మంది రైతులకు రైతు భరోసా అందింది?

జవాబు: మండలంలో 15,683 మంది రైతులు ఉండగా, 14,455 మంది రైతులకు రూ.18.50 కోట్లు రైతు భరోసా కింద వారి ఖాతాలో ప్రభుత్వం జమ చేయడం జరిగింది.

ప్రశ్న: ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకం కింద అర్హులైన రైతులు ఎంత మంది ఉన్నారు?

జవాబు: మండలంలో 9071 మంది రైతులు ఉండగా వారిలో పీఎం కిసాన్‌కు అర్హులైన వారు 7,854 రైతులు ఉన్నారు.

ప్రశ్న: రైతు బీమాకు ఎంత మంది రైతులు అర్హులు?

జవాబు: గత ఏడాది 2024 ఆగస్టు 15 నుంచి 2025 జూలై వరకు 8,905 రైతులు రైతు బీమాకు సం బంధించిన జాబితాలో ఉన్నారు.

ప్రశ్న: ప్రస్తుత సంవత్సరం ఎంత మంది రైతులు మృతి చెందారు?

జవాబు: 2024-25 సంవత్సరం జూలై వరకు 46 మంది రైతులు మృతి చెందగా ఇప్పటికే 41 మంది రైతుల నామినీ ఖాతాలో రూ. 2 కోట్ల ఐదు లక్షలు చెల్లించాం. ఐదుగురికి రైతులకు సంబంధించిన ఎల్ఐసీ కార్యాలయంలో ప్రాసెసింగ్‌లో ఉన్నాయి.

● (మద్నూర్, ఆంధ్రజ్యోతి)

అర్ధంతరంగా నిలిచిన లైబ్రరీ నిర్మాణ పనులు

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

నసురుల్లాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిర్జాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న లైబ్రరీ భవనం అర్ధాంతరంగా నిలిచిపోయింది. కొన్నేళ్ల క్రితం స్థానిక గ్రామ పంచాయితీ భవనంపైన పది లక్షల రూ పాయలతో భవనం నిర్మాణం పనులు ప్రారంభించారు. అనుకున్న దానికన్న పెద్దగా లైబ్రరీ భవనం రావడంతోనిధులు చాలక పను లు నిలిచిపోయాయి. దీంతో పాలకుల పని తనంతో లైబ్రరీ ప్రారంభాఇనకి నోచుకోకుండా పోయింది.

● నిర్మాణానికి మరో రూ.5 లక్షలు అవసరం

గ్రామంలో నిర్మాణ దశలోనే ఆగిపోయిన లైబ్రరీ భవనం పూర్తి కావడానికి మరో ఐదు లక్షలు నిధులు అవసరం అవుతుందని గ్రామస్తులు తెలుపుతున్నారు. గతంలో కేటాయించి న



గ్రామ పంచాయతీ భవనంపై లైబ్రరీ పనులు ప్రారంభించిన దృశ్యం

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి పోటీ పరీక్షలు, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూనే ఉంది. దీంతో మిర్జాపూర్, వీరాపూర్ దుబ్బా గ్రామాల ప్రజలు చదువుకోవడానికి ప్రదేశం లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. గతంలో లైబ్రరీ ఉన్న శిథిలావస్థ భవనంలో సైతం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, నూతనంగా భవన నిర్మాణం ఏర్పాటు చేసినప్పటికీ అది అర్ధాంతరంగానే నిలిచిపోయింది. కాగా మిర్జాపూర్ గ్రామ విద్యార్థులు ఉన్నత చదువు చదవాలన్నా, కాంపిటీటీవ్ పరీక్షలు పాస్ అవ్వాలన్న చదువుకోవడానికి ప్రశాంత వాతావరణం కావాల్సి ఉంటుంది. కాని లైబ్రరీ ని ర్మా ణం అర్ధాంతరంగా ఆగిపోవడంతో విద్యార్థులు బాన్సువాడ, బోధన్, నిజామాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తుందని యువకులు వాపోతున్నారు. ఉదయం వెళ్లి సాయంత్రం వచ్చే వరకు జర్నీలోనే అలసిపోతున్నామని, దీంతో చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మిర్జాపూర్ గ్రామంలో మధ్యలోనే నిలిచిపోయిన లైబ్రరీ భవన నిర్మాణ పనులు

పది లక్షల మేర పనులు పూర్తిగా అయ్యాయని మరో ఐదు లక్షలు కేటాయిస్తే లైబ్రరీ పూర్తి అవుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి గ్రామంలో లైబ్రరీ భవన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని యువకులు కోరుతున్నారు.

● పనులు పూర్తి చేసి, లైబ్రరీని వాడుకలోకి తీసుకురావాలి



గ్రామంలో అర్ధంతరంగా నిలిచిపోయిన లైబ్రరీ పనులను అధికారులు పూర్తి చేసి, లైబ్రరీని ప్రారంభించి వాడుకలోకి తీసుకురావాలి. గ్రామంలో లైబ్రరీ లేకపోవడంతో యువకులు ఇబ్బంది పడుతున్నారు.

\- జంగిలి శ్రీనివాస్, మిర్జాపూర్, గ్రామస్థుడు



బీర్కూర్ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న భుజంగరావు

బీర్కూర్ తహసీల్దార్‌గా భుజంగరావు

బీర్కూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల నూతన తహసీల్దార్‌గా శుక్రవారం సాయి భుజంగరావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న లతను ఉన్నతాధికారులు డిప్యూటేషన్‌పై ఎల్లారెడ్డికి డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా పంపించారు. ఎల్లారెడ్డిలో డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న భుజంగరావును బీర్కూర్ తహసీల్దార్‌గా పంపించారు.

క్రీడా దుస్తుల పంపిణీ

మోర్తాడ్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్‌పల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం కరుణ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా దుస్తువులను డీఆర్‌డీఏ పీసీల జిల్లా కార్యదర్శి పడకల శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, కిరణ్‌కుమార్, మౌనమి, వనిత పాల్గొన్నారు.

సారూ.. హెల్మెట్ ఏదీ..?

● నిబంధనలు పోలీసులకు వర్తించవా..



హెల్మెట్ లేకుండా బైక్‌పై వెళుతున్న పోలీసులు

నసురుల్లాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్క వాహనదారుడు హెల్మెట్ పెట్టుకొని ద్విచక్ర వాహనాలు నడపాలని ఓ వైపు ఎస్సై రాఘవేంద్ర పోలీసు సిబ్బందితో కలిసి అవగాహన కల్పిస్తున్నారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారికి పోలీసులు విధిస్తున్నారు. కాగా మండల కేంద్రంలో పోలీసులు మాత్రం హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్నారు. వారిని చూసిన ప్రజలు సామాన్యులకే నిబంధనలు అనీ, పోలీసులకు నో రూల్స్ అంటూ చర్చించుకుంటున్నారు.

నానో యూరియానే నయం

● ద్రవరూప యూరియాతో పైరుకు మేలు ● తగ్గనున్న పంట సాగు ఖర్చు ● విస్తృత ప్రచారం చేస్తున్న అధికారులు

కోటగిరి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కోటగిరి ఉమ్మడి మండలంలో ఖరీఫ్ సాగు పూర్తి కావచ్చింది. వివిధ పంటల్లో దశల వారీగా ఉపయోగించే యూరియా కొరత రైతులను వేధిస్తోంది. ఈ నేపథ్యంలో అధికారులు గులికల యూరియాకు బదులుగా నానో (ద్రవ రూపం) యూరియాను వాడాలని సూచిస్తున్నారు. నానో యూరియాతో కలిగే ప్రయోజనాలపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఖర్చు తగ్గడమే కాకుండా అధిక దిగుబడి వస్తుందని, రవాణా సులభం అవుతుందని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో ఇప్పుడిప్పుడు రైతులకు నానో వాడకానికి ముందుకు వస్తున్నారు.



కొత్తపల్లి సొసైటీలో విక్రయిస్తున్న నానో యూరియా, డీఏపీ

గులికల యూరియా కంటే ధర తక్కువే..

నానో యూరియా ఒక్క బాటిల్(500మిల్లి లీటరు) 45కేజీల బస్తా గులికల యూరియాతో సమానమని చెబుతున్నారు. 45కిలోల యూరియా బస్తా ధర రూ.270 కాగా అర లీటర్ నానో యూరియా 225రూపాయలకు లభిస్తుంది. నత్రజనిని అందించే ఈ ఎరువు ద్వారా మొక్కల్లో పచ్చదనం, చురుకైన పెరుగుదల వస్తుందని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. పంటలకు నత్రజనిని అందించే రైతులు గులికల యూరియాను రెండు నుంచి మూడు సార్లు వేస్తున్నారు. ఇందులో నత్రజనిని 30నుంచి 50శాతమే పంట వినియోగించుకుంటుంది. మిగతాది అంత వృథా అవుతుంది. నేల, గాలి, నీటిని కలుషితం చేస్తుంది. అదే నానో ఎరువు వాడకంతో ఇలాంటివి జరగవని అధికారులు పేర్కొంటున్నారు.



యాద్గార్‌పూర్ శివారులో వరి పైరుకు ఎరువు చల్లుతున్న రైతు

బహుళ ప్రయోజనకారిగా నానో

నానో యూరియా కణాలు చిన్నవిగా ఉండడంతో పంటకు 80శాతం కన్న ఎక్కువగా చేరుతుంది. మొక్కలకు నత్రజని అవసరాన్ని సమర్థవంతంగా తీరుస్తూ ఆకుల్లో కిరణజన్య సంయోగక్రియ పెంచుతుంది. వేళ్లలో కణజాలం వృద్ధికి ఉపయోగపడుతుంది. సంప్రదాయ యూరియాతో పోలిస్తే 50శాతం, అంతకంటే తక్కువ అవసరం అవుతుండడంతో రైతులకు ఖర్చు తగ్గుతుంది. 500మి.లీటర్ల నానో యూరియా బాటిల్ సులభంగా ఎక్కడైనా తీసుకెళ్లవచ్చని అధికారులు చెబుతున్నారు.

పంట దిగుబడి పెరుగుతుంది..

: రాజు, మండల వ్యవసాయ అధికారి



గులికల ఎరువు కంటే నానో ఎరువులు చాలా మేలైనవి. వరి నాటుకు ముందుగా ఒకేసారి నానో డీఏపీని పొలంలో పిచికారీ చేయాలి. అలాగే నానో యూరియాను లీటరు నీటికి 2మి.లీటరు లేదా 4మి.లీటరు చొప్పున కలిపి మొదట పంట పెరుగు దశలో తర్వాత నెలలోపు, పూత దశలో పిచికారీ చేయాలి. దీంతో పంట దిగుబడి పెరుగుతుంది.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన అన్వేష్‌రెడ్డి



జన్కంపేట్‌లో మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న అన్వేష్‌రెడ్డి

వేల్పూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలో మూడు రోజుల క్రితం గుండెపోటుతో మరణించిన కొలిప్యాక లింగన్న కుటుంబాన్ని శుక్రవారం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి పరామర్శించారు. మృతుని మనుమడు సంతోష్, కూతురు యమున, అల్లుడు మైలారం గంగారాం వారిని అన్వేష్‌రెడ్డి ఓదార్చి కుటుంబానికి ప్రగాడ సానుభూతి సంతాపం తెలియజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు జేమ్స్ గంగారెడ్డి, సౌడ శ్రీనివాస్, రంగు కిషోర్‌గౌడ్, సౌడ జైరాజ్, ఆశన్నగారి సురేష్, వినోద్, జీజీ రెడ్డి, నర్సింహారెడ్డి, సత్యం తదితరులున్నారు.

కేటీఆర్ ఆత్మ గౌరవ గర్జనకు తరలివెళ్లిన బీఆర్ఎస్ నాయకులు



లింగంపేటకు తరలివెళ్లిన ఎల్లారెడ్డి బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కేటీఆర్ నిర్వహించే ఆత్మగౌరవ గర్జన సభకు ఎల్లారెడ్డి మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. ఉదయం మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఫామ్ హౌస్ వద్ద సమావేశమై అక్కడి నుంచి పలు వాహనాలపై అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీ చౌక్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం లింగంపేటలో కేటీఆర్ నిర్వహించే ఆత్మగౌరవ గర్జన సభకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జలంధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్ కుమార్, ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ నర్సింలు, వెల్లుట్ల సొసైటీ చైర్మన్ సాయిలు, శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

ఇందిరమ్మ పాలనలోనే సంక్షేమం



రేషన్ కార్డ్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

పెద్ద కొడప్‌గల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ పాలనలోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని మాజీ సర్పంచ్ గణపతిరావ్ పేర్కొన్నారు. శుక్రవారం గ్రామంలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా గణపతి రావు మాట్లాడుతూ గత పదేళ్లుగా ప్రజలకు అందని రేషన్ కార్డులు నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అందజేయడం గర్వకారణమన్నారు. దీంతో పాటుగానే ప్రతీ గ్రామంలో గూడు లేనివారికోసం ఇందిరమ్మ పథకం కింద ఇళ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, డీలర్ మోతీరాం, నాయకులు రమేష్, లాల్‌సింగ్, మష్నాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు.. బహు బాగు

- జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాస్



పామాయిల్ గెలను అందజేస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాస్

రెంజల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ పంట సాగు వల్ల రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తాడ్‌బిలోలి గ్రామంలో రైతు సురేష్ ఆయిల్‌పామ్ పంట తోటలో మొదటి ఆయిల్‌పామ్ గెలలను కోత కార్యక్రమాన్ని జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు పంట సాగు ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలో 5,600 ఎకరాలలో పంటను సాగు చేస్తున్నారని, ఒక్కసారి పంటను నాటితే 4వ సంవత్సరం నుంచి రైతులు దిగుబడి పొందవచ్చని, 4వ సంవత్సరం నుంచి 30ఏళ్ల వరకు నిరంతరాయంగా ఆదాయం పొందవచ్చన్నారు. ఒక ఎకరానికి 8నుంచి 12టన్నుల వరకు దిగుబడి వస్తుందని రైతులు ఆయిల్‌పామ్ పంట సాగు వైపు మొగ్గు చూపితే ఎకరానికి 2లక్షల వరకు ఆదాయం పొందవచ్చన్నారు. ప్రభుత్వం సబ్సి డీ ద్వారా రైతులకు ఆయిల్‌పామ్ పంటను అందజేస్తుందని, సాగు విధానంపై ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి సాగు విస్తీర్ణాన్ని పెం చడం జరుగుతుందని అన్నారు. ఒక ఎకరానికి 2లక్షల వరకు ఆదా యం పొందవచ్చని వీటి పంట వల్ల ఎటువంటి నష్టం వాటిల్లదని సూచించారు. దేశంలో పామాయిల్ నూనెకు అధిక డిమాండ్ ఉందని, ముఖ్యంగా నూనె వంటగా, బేకరి ఫుడ్ ఐటమ్స్, కాస్మోటివ్ ఐటమ్స్‌లలో ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. రైతులు పామాయిల్ సాగు వైపు మొగ్గు చూపాలని, ప్రభుత్వం సబ్సిడీని రైతులకు అందిస్తుందన్నారు. ఇతర పంటల్లాగా చీడపీడలు ఉండవని, పామాయిల్ వ్యవస్థలో దళారీ వ్యవస్థ ఉండదని, నేరుగా పంటనే పామాయిల్ పంట వారే కొనుగోలు చేస్తారన్నారు. ఇప్పటికే జిల్లాలో 60 నుంచి 70మంది రైతులు పామాయిల్ పంటను అమ్మడం జరిగిందని వారి ఖాతాల్లో నేరుగా డబ్బులను కూడా అందజేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి వహీద్, ప్రీయూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డీజీఎం మల్లేశ్వర్ రావు, జోనల్ మేనేజర్ రోహిత్, జిల్లా మేనేజర్ నవీన్, మాజీ ఎంపీటీసీ మంగళి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

31న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలి



రానాకలాన్ గ్రామంలో బీడీ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న టీయూసీఐ రాష్ట్ర నాయకుడు మల్లేష్

ఎడపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని టీయూసీఐ రాష్ట్ర నాయకులు మల్లేష్ అన్నారు. శుక్రవారం ఎడపల్లి మండలంలోని రానాకలాన్ గ్రామంలో కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కనీస వేతనాల సవరణ చేయాలని, 9వేల ఈపిఎఫ్ పెన్షన్ ఇవ్వాలని, బీడీ కార్మికులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా జీవన భృతి ఇవ్వాలని, దేశ కార్మిక వర్గానికి నష్టం కలిగించే 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఈ నెల 31న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను కార్మికుల అధిక సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పావిత్రి, సవిత, లక్ష్మి, సునంద, గంగామణి, సౌమ్య, అనురాధ, లావణ్య తదితరులు ఉన్నారు.

విఠలేశ్వర ఆలయంలో మహా అన్నదానం

బీర్కూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం భైరాపూర్ విఠలేశ్వర ఆలయ సన్నిధిలో శుక్రవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జుక్కల్ మండలం లొంగన్ గ్రామానికి చెందిన వందలాది మంది భక్తులు గురువారం పాదయాత్రగా విఠలేశ్వర స్వామి ఆలయానికి తరలివచ్చారు. స్వామి వారిని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించగా వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్

గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.3 కోట్లు

● గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డి

నిజామాబాద్ కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 3కోట్లను కేటాయించినట్లు గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డి తెలిపారుర. శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చైర్మన్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఏర్పడిన నూతన మండలాల్లో శాఖ గ్రంథాలయాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడంపై తీర్మానించినట్లు తెలిపారు. ఆర్మూర్ శాఖ గ్రంథాలయంలో పాఠకులు అధికంగా వస్తున్నందున పాఠకుల సౌకర్యం కొరకు గ్రంథాలయ పనివేళలను 6గంటల నుంచి 12 గంటల వరకు పెంచామన్నారు. అన్ని గ్రంథాలయాల్లో పాఠకుల సౌకర్యం కోసం మౌలిక వసతులతో పాటు మెరుగైన వసతులను ఏర్పాటు చేయడానికి తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డి, జిల్లా డిప్యూటీ డైరెక్టర్ వయోజన విద్య అధికారులు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సబ్ కంట్రోల్స్‌ను పునరుద్ధరించాలి

● సీపీ సాయి చైతన్య


పోలీసు సబ్ కంట్రోల్ పాయింట్లను పరిశీలిస్తున్న సీపీ

నిజామాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నగరంలోని ప్రధాన జంక్షన్లలో 'పోలీస్ సబ్ కంట్రోల్స్' పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశించారు. శుక్రవారం రాత్రి ఆయన నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, బోధన్ బస్టాండ్, అర్సపల్లి చౌరస్తా, చార్ బై పెట్రోల్ బంక్, వీక్లీ మార్కెట్, కంటేశ్వర్ చౌరస్తా టీ జంక్షన్ ప్రాంతాల్లో పోలీస్ సబ్ కంట్రోల్ పాయింట్లను పరిశీలించారు. వివిధ జంక్షన్‌లలో అధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీలతో గల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రధాన జంక్షన్లలో కొత్త ట్రాఫిక్ సిగ్నల్‌లను జీబ్రా లైన్లను స్టాప్ లైన్స్ ను ఏర్పాటు చేయాలన్నారు. హనుమాన్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ పునరుద్ధరించాలని ఆదేశించారు. జంక్షన్‌లలో అవసరమైన చోట వెంటనే ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయాలన్నారు. సీపీ వెంట ట్రాఫిక్ ఏసీపీ సయ్యద్ మస్తాన్ అలీ, ట్రాఫిక్ సీఐ ప్రసాద్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (వెల్ఫేర్) తిరుపతి, అధికారులు ఉన్నారు.

మహిళలకు, పిల్లలకు భరోసా కేంద్రం అండ

సుభాష్‌నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మహిళలకు, పిల్లలకు మెరుగైన సేవలు అందిస్తూ భరోసా కేంద్రం అండగా నిలుస్తుందని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయం ఆవరణలో ఉన్న భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. గత కొంతకాలంగా నమోదైన పోక్సో, రేప్ కేసుల్లో 7 మంది బాధిత పిల్లలకు, మహిళలకు భరోసా కేంద్రం తరఫున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో అదనపు పోలీస్ కమిషనర్ బస్వారెడ్డి, భరోసా సెంటర్ కోఆర్డినేటర్ రోజా, లీగల్ అడ్వైజర్ గీతిక, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై పుష్పవతి, సిబ్బంది మౌనిక, సరిత, ఏములు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వాసిపై షార్జాలో కేసు

నిజామాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వేల్పూర్ మండలం పడిగెలకు చెందిన మండిజాల గంగా ప్రసాద్ దుబాయిలో 'ఇల్లు కిరాయి ఒప్పందం' విషయంలో బాధితుడయ్యాడు. రిక్రూటింగ్ ఏజెంట్ల ముఠా అతని పేరుతో 'ఇల్లు కిరాయి ఒప్పందం' చేయించి, అతని పేరు మీద పోస్ట్ డేటెడ్ చెక్కులు జారీ చేయించారు. ఫలితంగా అతని మీద షార్జా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై, 27 వేల దిరా ముల జరిమానా విధించారు. అందులో 4 వేల దిరా ములు చెల్లించి బెయిల్‌పై బయటపడినా, మిగతా 23 వేల దిరా ములు (సుమారు రూ.5.4 లక్షలు) చెల్లించాల్సిన పరిస్థితిలో దుబాయి లోనే చిక్కుకుపోయాడు.

ఆరేళ్ల పాపపై పెంపుడు తండ్రి దాష్టీకం

(ఐదో పేజీ తరువాయి)

వచ్చారు. గ్రామంలో ఓ ఇల్లును అద్దెకు తీసుకుని ఉంటున్నారు. మూడు రోజుల కిందట రాత్రి సమయంలో పెంపుడు తండ్రి విజయ్ చిన్నారిని ముఖం, చెంపలపై, వీపుపై కాళ్లకు వాతలు పెట్టి తీవ్రంగా గాయపరిచాడు. దీంతో తీవ్ర గాయాలైన చిన్నారిని చికిత్స నిమిత్తం మేనమామ మామిడిపల్లిలోని బస్తీ ఆసుపత్రికి తీసుకువచ్చాడు. ఆస్పత్రిలో పాప ఒంటిపై గాయాలను గమనించిన స్థానికులు విషయం అడిగి తెలుసుకొని చైల్డ్ వెల్ఫేర్ హెల్ప్ లైన్‌కు సమాచారం ఇచ్చారు. గురువారం జిల్లా ఐసీడీఎస్ కౌన్సిలర్ జోత్స్న మమిడిపల్లికి చేరుకొని చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. తల్లి మమతను సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగారు. పెంపుడు తండ్రి విజయ్‌ను ఫోన్ ద్వారా వివరాలు అడుగగా తన చిన్నారి సరిగా చదవడం లేదన్న కోపంతో కొట్టిన మాట వాస్తవమని అంగీకరించాడు. సంఘటన స్థలానికి రమ్మని పిలువగా రాకుండా పరారయ్యాడు. తీవ్ర గాయాలైన చిన్నారికి చికిత్స చేయించిన అనంతరం చిన్నారికి ఆధార్ కార్డు లేకపోవడంతో మేనమామ సంరక్షణలో ఉంచారు.

శతాబ్దపు మోసం కాంగ్రెస్ మేనిఫెస్టో

(ఐదో పేజీ తరువాయి)

జయంతి సందర్భంగా కాంగ్రెస్ నేతలు పోలీసులచేత స్థానిక బీఆర్ఎస్ దళిత నేతపై దాడిచేయడాన్ని నిరసిస్తూ ఈ గర్జనను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేటీఆర్ హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా మోసం చేశారన్నారు. రైతులకు సంబంధించిన రుణమాఫీ రైతుబంధు, బోనస్ నిధులను సుట్‌కేస్‌లో ఢిల్లీకి మళ్లించారని ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణను అప్పుల పాలు చేశారని కాంగ్రెస్ అబద్ధపు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. వేములవాడకు వచ్చిన రేవంత్‌రెడ్డి తిన్న భోజనం ఖరీదు ఒక ప్లేట్‌కు రూ.1లక్ష 35వేలని, అందాలపోటీల్లో ఒక్కో ప్లేట్ భోజనానికి రూ.1లక్ష ఖర్చుచేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కనీసం వందరూపాయలతో గురుకులాల పిల్లలకు మంచి భోజనం పెట్టే సోయిలేదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయకుండా దళితగిరిజనులపై అణచివేతకు పాల్పడుతున్న రేవంత్ ప్రభుత్వాన్ని గద్దె దించేదాక వదిలిపెట్టబోమని అన్నారు. ప్రజలు ఆలోచించి జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కేటీఆర్ కోరారు. ఇదేవేదికపై గతంలో దాడికి గురైన బీఆర్ఎస్ దళిత నేత సాయిలును కేటీఆర్ సన్మానించారు. అనంతరం కేటీఆర్ ఆయన ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ: ఎమ్మెల్యే

డిచ్‌పల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని మొదటి జాబితాలో కొత్త రేషన్ కార్డులు రానివారు ఎలాంటి ఆందోళన చెందవద్దని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేఎన్ఆర్ గార్డెన్‌లో నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. ఈయేడాది జూన్ వరకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరికి రేషన్ కార్డులు అందజేస్తామన్నారు. మండలంలో 3270 రేషన్ కార్డులు మంజూరు అయ్యాయని ఆయన పేర్కొన్నారు. రూరల్ నియోజకవ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ర్గంలో 3500 ఇళ్లు మంజూరు అయ్యాయని ప్రస్తుతం 1500 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు వచ్చే ఐదేళ్లలో 22వేల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఇట్టి నిర్మాణం పనుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి తీరుతుందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పట్టం కట్టాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్‌డీవో రాజేంద్రకుమార్, తహసీల్దార్ సతీష్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి యోవాన్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ గోదాం ప్రారంభం

డిచ్‌పల్లి మండలంలోని మిట్టపల్లి గ్రామంలో 15లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన 250 మెట్రిక్ టన్నుల సహకార గిడ్డంగిని ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రారంభించారు. ఎరువుల గోదాంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి వినతి..

మిట్టపల్లి గ్రామంలో శ్రీకృష్ణ మందిరం సొసైటీ సభ్యులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేకు కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం కోసం వినతిపత్రం సమర్పించగా రూరల్ ఎమ్మెల్యే అందుకు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మాసిపెద్ది రవి, బాలగంగాధర్, గోపురాజేశ్వర్, ఒడ్డెం నర్సయ్య, మాసిపెద్ది శ్రీను, రమేష్ పాల్గొన్నారు.



పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అడుగులు

● రేంజల్ శివారులో స్థలాన్ని పరిశీలించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి


స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వడి వడిగా అడుగులు పడుతున్నాయి. ప్రభుత్వం పామాయిల్ పంటను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో జిల్లాకు ఒక పామాయిల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతోంది. ఈ మేరకు బోధన్ డివిజన్‌లోని రేంజల్ ప్రాంతంలో ఫ్యాక్టరీ ఏర్పాటుకు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో పాటు ఫ్యాక్టరీ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. సుమారు 120 ఎకరాలలో ఏర్పాటు చేయనున్న ఫ్యాక్టరీ కోసం స్థల సేకరణ చేస్తున్నారు. గతంలో బోధన్ ప్రాంతంలో నిజాంషుగర్ ఫ్యాక్టరీతో పాటు పవర్ ప్లాంట్, బిన్నింగ్ మిల్లులు ఉండేవి. కాలక్రమేనా అవన్నీ మూతపడటంతో ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎలాంటి పరిశ్రమలు లేవు. ప్రస్తుతం పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో ఆ ప్రాంతంలో భూములకు మంచి డిమాండ్‌తో పాటు ఆ ప్రాంతంలోని యువతకు ఉపాధి అవకాశాలు దొరికే అవకాశాలు ఉన్నాయి. ప్రీ యూనిక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ సుమారు 100 కోట్లతో ఈ ఫ్యాక్టరీని నెలకొల్పేందుకు ఏర్పాట్లు చేస్తుంది. సీఎం రేవంత్‌రెడ్డి ఈనెలాఖరున జిల్లాకు రానున్న నేపథ్యంలో ఆయన ఈ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రకటన చేసే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో 15వేల ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు కాగానే ఫ్యాక్టరీని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటు వల్ల సుమారు 500 మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. 150 మంది శాశ్వత ఉద్యోగులతో పాటు ఫ్యాక్టరీపై ఆధారపడి మరికొంత మంది ఉపాధి పొందే అవకాశాలు ఉన్నాయి. ఫ్యాక్టరీ స్థలం కోసం రోడ్డు వేయడంతో ఆ ప్రాంతంలో ప్రైవేటు వ్యక్తులు భూములు కొనేందుకు వస్తున్నట్లు తెలుస్తోంది.

పీసీసీ అధ్యక్షుడి ఇంటి ముట్టడి ఉద్రిక్తం

● విద్యార్థి సంఘు నాయకుల అరెస్టు

సుభాష్‌నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని వామపక్ష విద్యార్థి సంఘ నాయకులు నిర్వహించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఇంటి ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. నగరంలోని బస్వాగార్డెన్ ప్రాంతంలో శుక్రవారం మహేష్‌కుమార్‌గౌడ్ ఇంటిలోకి చొచ్చుకొని వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అరెస్టు చేసి నాల్గవ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టుకు వ్యతిరేకంగా వామపక్ష విద్యార్థి నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా పీడీఎస్‌యూ ఉపాధ్యక్షుడు కార్తిక్, మైత్రి రాజశేఖర్, మనోజ్, సాయినాథ్, రాహుల్, శ్రీకాంత్, సాయికిరణ్, పాల్గొన్నారు


నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఇద్దరి రిమాండ్

మోపాల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు వేరువేరు చోట్ల దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు దొంగలను పట్టుకున్నట్లు ఎస్సై ఆరీఫ్ శుక్రవారం తెలిపారు. నగర శివారులోని బైపాస్ రోడ్‌లో ద్విచక్ర వాహనాన్ని చంద్రశేఖర్ కాలనీకి చెందిన ఎస్‌కే మజీద్ దొంగిలించగా శుక్రవారం నింధితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. కేశాపూర్ గ్రామం మహాలక్ష్మి ఆలయంలో చోరీకి పాల్పడ్డ సారంగపూర్‌కు చెందిన గుంజ గంగాధర్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఆభరణాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సమ్మేళనానికి తరలాలి

ధర్పల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27న బృందావన్ గార్డెన్‌లో జరిగే బంజారా ఆత్మీయ సమ్మేళనకు జిల్లా నలుమూలల నుంచి గిరిజనులు తరలిరావాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్ నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోగల బంజారా సేవా సంఘంలో మండలంలోని వివిధ గ్రామాల్లో గల జగదాంబ దేవి ఆలయ పూజారులకు ఘనంగా సన్మానించారు.

యూరియా పంపిణీ

సిరికొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలానికి రోజుకు 60 నుంచి 80 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని మండల వ్యవసాయ అధికారి నర్సయ్య తెలిపారు. శుక్రవారం సిరికొండ పీఏసీఎస్‌లో వ్యవసాయ అధికారి రైతులకు దగ్గరుండి యూరియాను పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.. మండలలోని సిరికొండ, తూంపల్లి, హొన్నాజిపేట్ పీఏసీఎస్ పరిధిలోని గడ్కోల్ గిడ్డంగులకు 60 నుంచి 70 మెట్రిక్ టన్నుల యూరియాను సరాఫరా జరుగుతున్నదని ఆయన తెలిపారు.

జిల్లాలో వర్షం

నిజామాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో సగటున 10.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా బోధన్‌లో 25.8 మిల్లీమీటర్ల వర్షం, సాలూరాలో 24.5, ఎడపల్లిలో 21.3, చందూర్‌లో 20.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని అన్ని మండలాల్లో వర్షాపాతం నమోదైంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో వరినాట్లు ముమ్మరం అయ్యాయి. వర్షాలు లేక నారు వచ్చినప్పటికీ నాట్లు వేయని రైతులంతా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పనులను ముమ్మరం చేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి కూడా స్వల్పంగా ఇన్‌ఫ్లో వస్తుంది.

























జిల్లా పెద్దాసుపత్రికి సుస్తీ!

(ఐదో పేజీ తరువాయి)

ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ మెడికల్ కళాశాల కార్డియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణమాలకొండా రెడ్డిని ఈనెల 8న ప్రభుత్వం నియమించగా ఆయన ఇక్కడ పనిచేసేందుకు ఆసక్తి చూపనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం డాక్టర్ శ్రీనివాస్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన గత పది రోజులుగా సెలవుల్లో ఉండి శుక్రవారమే విధుల్లో చేరారు. ఆసుపత్రి సిబ్బంది, ఉద్యోగుల మధ్య సరైన సఖ్యత లేక ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేసేందుకు అధికారులు ఎవరూ మొగ్గు చూపడం లేదు. పదేళ్లుగా ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌లే జీజీహెచ్ పర్యవేక్షణ చేస్తుండటంతో ఆసుపత్రి నిర్వహణ అధ్వానంగా మారుతోంది.

ప్రతిపాదనలు పంపించాం..

డాక్టర్ శ్రీనివాస్, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్

జీజీహెచ్‌లో మరమ్మతులకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. 2కోట్ల 66 లక్షల పనులకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాం. ఇంకా బడ్జెట్ విడుదల కాలేదు. బడ్జెట్ విడుదల కాగానే పనులు ప్రారంభిస్తాం.

అర్హులైన ప్రతి కుటుంబానికీ రేషన్ కార్డు

(ఐదో పేజీ తరువాయి)

ఉన్నవారందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. అర్హులైన వారు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే

బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కలెక్టర్‌తో కలిసి సందర్శించారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. లీకేజీలు, ఫ్లోరింగ్ వంటి వాటికి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా పౌరసరఫరా శాఖ అధికారి అరవింద్ రెడ్డి, సివిల్ సప్లై డీఎం శ్రీకాంత్ రెడ్డిలతో స్థానిక అధికారులు, రేషన్ కార్డుల లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.



చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.220	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	రూ.230	రూ.280	రూ. 300



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.99,900	రూ.92,000	రూ.1190

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : ది ఫెంటాస్టిక్-4 (తెలుగు) (10.25)
: సయ్యారా (హిందీ) (1.00)
: జురాసిక్ వరల్డ్ (ఇంగ్లీష్) (4.10)
: హరిహర వీరమల్లు (7.00, 10.20)
స్క్రీన్-2 : హరిహర వీరమల్లు (9.40, 1.00, 4.20, 7.40, 11.00)
స్క్రీన్-3 : హరిహర వీరమల్లు (11.05)
: మహావతార్ నర్సింహా (2.25, 7.50)
: ది ఫెంటాస్టిక్-4 (ఇంగ్లీష్) (5.15, 10.40)
స్క్రీన్-4 : సైయ్యారా (హిందీ) (10.20, 1.30, 4.40, 7.50, 11.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మహావతార్ నరసింహా (11.00)
: హరిహర వీరమల్లు (1.25, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : హరిహర వీరమల్లు (11.00)
: మహావతార్ నరసింహా (1.55, 7.30)
: ది ఫెంటాస్టిక్-4 (3డి తెలుగు) (4.30, 10.30)
స్క్రీన్-3 : ది ఫెంటాస్టిక్-4 (3డి తెలుగు) (11.00)
: సయ్యారా (హిందీ) (1.20, 4.20, 7.30, 10.20)

దేవి : జూనియర్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : హరిహర వీరమల్లు (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : ది ఫెంటాస్టిక్-4 (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: కొత్తపల్లిలో ఒకప్పుడు (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్